## క్లుప్తంగా

### కిశోర బాలికలకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని కల్లెగాం, రింగన్‌ఘాట్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం కిశోరబాలికలకు పౌష్టికాహారం (పల్లిపట్టి) పంపిణీ చేశారు. రక్తం వృద్ధి చెందేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని సిబ్బంది పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త లింగుబాయి, ఏఎన్‌ఎం తిరుమల ఉన్నారు.

### పీరీల ఊరేగింపు



పీరీల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కెరమెరి: గిరిజన గ్రామాల్లోనూ పీరీల పండుగను ఆదివాసీలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఆదివారం మొహరం పండుగ పురస్కరించుకుని శనివారం పీరీల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అంబారావుగూడ, రింగన్‌ఘాట్ గ్రామాల్లో బ్యాండు భాజాలతో ఊరేగింపు కొనసాగింది. వీటితో పాటు పలు గ్రామాల్లో పీరీల ఊరేగింపు నిర్వహించారు. ఎక్కడిక్కడ భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మలిదలు ఎక్కించారు. శోభాయాత్రలో భక్తులు పాల్గొన్నారు.

### గోరింటాకు సంబురాలు



పాఠశాలలో గోరింటాకుతో విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఆదర్శనగర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు సంబరాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు గోరింటాకు పెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పట్టణ పద్మశాలి భవనంలో మహిళ సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు శనివారం నిర్వహించారు. మహిళలందరు ఒక్కచోట చేరి గోరింటాకు పెట్టుకున్నారు. పట్టణంలోని ద్వారకానగర్ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు.

### ఎమ్మార్పీఎస్ వార్డు కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీ సందీప్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ 10వ వార్డు కమిటీని నియమించారు. వార్డు అధ్యక్షుడిగా మోతె జాన్, ఉపాధ్యక్షులుగా మాటూరు కుమార్, సిలుముల నితిన్, ప్రధానకార్యదర్శులుగా సిలుముల నీరజ్, నికిత్, చంద్రశివ, మాటూరి, ప్రచార కార్యదర్శిగా మోతె సత్యనారాయణ, కోశాధికారిగా కిరణ్, సభ్యులుగా ప్రసాద్, సురేశ్, బాలేశ్‌లను నియమించారు. సంఘం జిల్లా ఇన్‌చార్జి గుండ థామస్ మాట్లాడుతూ ఈ నెల 7న రాజకీయ పార్టీల నాయకులతో కలిసి దండోరా జెండాలు ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుండ థామస్, రేగుంట కేశవరావు, మాటూరి జయరాజ్, భాగ్యలక్ష్మి, కళావతి పాల్గొన్నారు.

### శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా దెబ్బటి రాజు



రాజును సన్మానిస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా దెబ్బటి రాజు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు రాజును శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు పెరిక శ్రీకాంత్, మాట్ల రాజు, తోట సమ్మయ్య, సీహెచ్ శంకర్, శ్రావణ్, నాగరాజు, అశోక్, శ్రీనివాస్, గణేశ్, సాగర్, నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

### పెంచికల్‌పేట్ ఎస్సైగా అనిల్‌కుమార్

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ నూతన ఎస్సైగా అనిల్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన కొమురయ్య బదిలీపై జిల్లా పోలీస్ కార్యాలయానికి వెళ్లారు. అతని స్థానంలో అనిల్‌కుమార్‌కు నూతన పోస్టింగ్ ఇచ్చారు. బదిలీపై వెళ్లిన ఎస్సైని మండల మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు సన్మానించారు.

## అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం!



బాలాజీ అనుకోడలో రహదారి పక్కనే పడేసిన చెత్త



చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద రహదారిపై బురద నీరు



రవీంద్రనగర్2లో రహదారిపై నిలిచిన నీరు

చింతలమానెపల్లి: మండలంలోని ప్రధాన రహదారులపై పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రవీంద్రనగర్ 2లో మురికి కాలువలు లేక వరద నీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. కొన్ని చోట్ల బురదనీరు రహదారిపైనే నిలిచిపోతోంది. బాలాజీఅనుకోడలో కాలువల నుంచి తీసిన పూడిక రహదారి పక్కనే పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో కౌటాల నుంచి చింతలమానెపల్లి మీదుగా బెజ్జూర్, మహారాష్ట్రకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

# విద్యార్థుల యోగానందం..!

- పాఠశాలల్లో యోగా, ధ్యానం
- అరగంట కథల పుస్తకాల పఠనం
- ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ



కథల పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది



కెరమెరి ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

కెరమెరి: పాఠశాలల్లో ప్రతీరోజు ఐదు నిమిషాలు విద్యార్థులకు యోగా, ధ్యానం చేయించాలని ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అరగంట పాటు పిల్లలతో కథల పుస్తకాలు, పత్రికలు చదివించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాలలు 720 ఉండగా.. ప్రాథమిక పాఠశాలలు 560, ప్రాథమికోన్నత పాఠశాలలు 102, ఉన్నత పాఠశాలలు 58 ఉన్నాయి. వీటిల్లో సుమారు 45 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

**శారీరక దృఢత్వం**

విద్యార్థులు నిత్యం యోగా సాధన చేయడంతో శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉంటారు. ధ్యానం అలవాటు చేస్తే చదివే విషయాలపై ఏకాగ్రత పెరిగి, మానసిక ప్రశాంతత చేకూరుతుంది. కథలతో నైతిక విలువలు పెరగడం, పత్రికలు చదవడం వల్ల జ్ఞానం, జీకే సామాజిక, వర్తమాన అంశాలపై పట్టు లభిస్తుంది. 2022 నుంచి పాఠశాలల్లో యోగా సాధన చేయించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా దాదాపుగా అమలు కావడం లేదని విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న బడుల్లో కూడా వ్యాయామ ఉపాధ్యాయులు లేరు. యోగా రాని ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల్లో ఎలా అమలు అవుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**సమయం మించిపోతుంది..**

ఇప్పటికే విద్యాశాఖ ఎన్నో కార్యక్రమాలను పాఠశాల్లో అమలు చేస్తుంది. వారంలో చాలా సార్లు యోగాకు, పత్రికల పఠనానికి, కథల పుస్తకాలను అభ్యసనం చేయడానికి కేటాయించిన సమయం సరిపోవడం లేదు. విద్యార్థులు హాజరు తీసుకొని పాఠాలను బోధించేందుకు సమయం సరిపోవడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. మళ్లీ ఐదు నిమిషాలు యోగా, ధ్యాన ప్రక్రియలకు కేటాయిస్తే నిత్యం మొదటి పీరియడ్‌లో బోధన సమయం కోల్పోతామని తరగతి ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

**యోగా శిక్షకులు కరువు..**

యోగా శిక్షకులు లేకుండానే ప్రభుత్వం ఈ బాధ్యతను కూడా ఉపాధ్యాయులపై మోపడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణకు కరాటే శిక్షకులను నియమించినట్లుగానే శిక్షణ పొంది, అనుభవం ఉన్న వారిని యోగా శిక్షకులుగా నియమించాలని, మారుమూల ప్రాంతాలకు వార్త పత్రికలు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడమే కాకుండా విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**రోజూ యోగా చేయించాలి**



ప్రతీరోజు విద్యార్థులకు తప్పనిసరిగా యోగా చేయించాలి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రార్థనా సమయంలో లేదా తరగతి గదిలో 5 నిమిషాలు యోగా చేయించాలి. వార్తపత్రికలు చదివించాలి. దీంతో సమాజంపై విద్యార్థులకు అవగాహన కలుగుతుంది. కథల పుస్తకాలు చదవించడంతో మేథస్సు పెరుగుతుంది.

– ఉప్పులేటి శ్రీనివాస్, ఏంఈవో

## ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



పలకలు అందజేస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం గోపాల్

తిర్యాణి: మండలంలోని ఎర్రబండ గ్రామంలో పాఠశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, సమస్యను గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పీవో ఖుష్బూ గుప్తా పాఠశాలను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రొంపెల్లి కాంప్లెక్స్ హెచ్ఎం గోపాల్ గ్రామాన్ని సందర్శించి నూతనంగా పాఠశాలను ప్రారంభించడంతో పాటు విద్య బోధన చేపట్టేందుకు గాను సీఆర్టీని సైతం నియమించారు. అనంతరం విద్యార్థులకు పలకలతో పాటు పుస్తకాలు అందజేశారు. కాగా ప్రస్తుతం గ్రామంలో 12 మంది బడీడు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీఆర్పీ లచ్చు, సీఆర్టీ అమృత్‌రావు తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పారిశుద్ధ్య కార్మికులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు శివకుమార్, బీజేపీ పట్టణ దళిత మోర్చ అధ్యక్షుడు చిప్పకుర్తి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కౌటాల: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పుట్టిన రోజు వేడుకలను శనివారం కౌటాలలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి స్థానిక బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు ఉచితంగా పెన్నులు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు కుంచాల విజయ్, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు వానుపటేల్, మిథున్, భీమయ్య, రవి, మధుకర్, సాయి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

### సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్ ఉంటుందని ప్రిన్సిపాల్ మహేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో గతంలో పరీక్ష రాసి సీట్లు రాని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థులు ఉదయం 10 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో రావాలని సూచించారు.

### తుమ్మగూడ రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

కెరమెరి: ఇటీవల కురిసిన వర్షాలతో తుమ్మగూడ వంతెన ఇరువైపులా వేసిన మట్టి కొట్టుకుపోయింది. ఉన్న మట్టి బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో అనార్‌పల్లికి చెందిన నాయకులు రాథోడ్ శంకర్ నాయక్, రూప్‌లాల్ నాయక్, జాటోత్ ఉమేశ్, రాథోడ్ శేషారావు, బానోత్ వెంకటి, రాథోడ్ రాందాస్, సురేశ్ మానవతా దృక్పథంతో సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

### భగీరథ నీరు వృథా



కెరమెరి: ప్రజలకు అందాల్సిన శుద్ధజలం వృథాగా పోతుంది. మండలంలోని ధనోరా పంప్‌హౌజ్ వద్ద శనివారం మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి పోవడంతో నీరు పైప్‌లైన్ నుంచి ఎగిసిపడుతుంది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

### మురుగు తొలగించండి!



మూసుకుపోయిన కాలువ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని వార్డు నం.8లో మురుగు కాలువల్లో నీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. మాజీ కౌన్సిలర్ ఇంటికి వెళ్లే దారిలోని మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో చెత్తా చెదారంతో నాలా కూరుకుపోయిందని, సంబంధిత అధికారులు స్పందించి కాలువల్లోని పూడిక పనులు చేయాలని వారు కోరుతున్నారు. ప్రత్యేక అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆరోపించారు.

## ట్రిపుల్‌ఐటీకి విద్యార్థుల ఎంపిక



ఉమేజా నాజ్ | వర్షిత్ | సాయికృష్ణ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. శనివారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులు గుండేటి వర్షిత్, ఉమెజా నాజ్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కౌటాల: మండలంలోని తలోడి గ్రామానికి చెందిన కొమటపల్లి వెంకటేశ్వర్ –స్వరూప దంపతుల కుమారుడు సాయికృష్ణ బాసర ఆర్జీయూకేటీకి ఎంపికయ్యాడు. కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన సాయికృష్ణ పది ఫలితాల్లో 559 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో సాయికృష్ణ ఎంపిక కావడంతో హెచ్‌ఎం నారాయణ్‌సింగ్, ఉపాధ్యాయులు రమేశ్, రాంచందర్, చారి, రయీస్ అహ్మద్, మండల వాసులు సాయికృష్ణను అభినందించారు.

## ఆర్సీవో నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంతోష్

రెబ్బెన: జిల్లా విద్యార్థులకు మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలలో సీట్లు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆర్సీవోపై చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే ఇంటర్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు లక్షెట్టిపేటలో కౌన్సెలింగ్ నిర్వహించగా కేవలం 500 మార్కుల కంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారు మాత్రమే హాజరు కావాలని విద్యార్థులకు సమాచారం ఇచ్చారన్నారు. దీంతో ఇతర జిల్లాల్లో 500 మార్కులు, అంతకంటే తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు సైతం సీట్లు పొందారన్నారు. ఆర్సీవో నిర్లక్ష్యం మూలంగా జిల్లాలోని ఎంతోమంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో సీట్లు రాకుండా పోయాయన్నారు. జిల్లా విద్యార్థులకు నష్టం జరగకుండా జిల్లాలోనే కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

**కళాశాల వద్ద ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలి..**

రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలని మాజీ జెడ్పీటీసీ సంతోష్ కలెక్టర్‌ను కోరారు. కళాశాల ఎదుట ఉన్న జాతీయ రహదారిని దాటే క్రమంలో విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉందని విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న సైడ్‌డ్రైన్ పనులను నేషనల్ హైవే అధికారులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు ఎర్రం తిరుపతి పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

రెబ్బెన: కేంద్రం అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఎస్.తిరుపతి, మల్రాజు శ్రీనివాస్‌రావులు డిమాండ్ చేశారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్లను జేఏసీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెతో కార్మికులంతా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. సింగరేణిలో కొత్త గనులు ఏర్పాటు చేయాలని, కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, పెర్క్స్‌పై విధిస్తున్న ఐటీని తిరిగి కార్మికులకు యాజమాన్యమే చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, రాజేశ్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు అంజయ్య, రారాజు, గణేశ్, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

రెబ్బెన: నిరుద్యోగ మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తే ఆర్థిక స్వావలంబన సాధన దిశగా ముందుకు సాగాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. శనివారం గోలేటిలో వసుధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఏఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటితరం మహిళలు, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. నిరుద్యోగ మహిళలు స్వయం ఉపాధి రంగంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. అందుకు అనేక మార్గాలు ఉన్నాయని వసుధ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక స్వావలంబన సాధిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలవాలని కోరారు. ఏఎస్పీ అచ్చేశ్వర్‌రావు, ఎస్సై చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

### మంత్రి 'పొంగులేటి'ని కలిసిన 'సోయం'

కైలాస్‌నగర్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపూరావు శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. బోథ్ అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా 500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

### 'నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం'

ఇంద్రవెల్లి: నిరుద్యోగులకు హైదరాబాద్‌లోని వివిధ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ జేడీఎం నాగభూషన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరయ్యారు. 130 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కాగా.. పలువురిని వివిధ కంపెనీలకు ఎంపిక చేశారు. నిరంతరం జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం మల్లేష్, ఏపీఎం రామారావ్, హెచ్‌ఆర్ మేనేజర్ వినోద్, సురేందర్, జేఆర్‌పీ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

### రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ఇచ్చోడ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. శనివారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల పాటు సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మధురిమ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.